భూ కబ్జాలకు అడ్డుకట్ట పడేనా..?

- భూముల రక్షణకు కమిటీ ఏర్పాటు



రడగంబాల బస్తీలో కబ్జాకు యత్నించిన ప్రభుత్వ భూమి

బెల్లంపల్లి: బల్దియాలో కొనసాగుతున్న భూ కబ్జాల పరంపరకు తెరపడేనా...?, ఆక్రమణకు గురైన విలువైన ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటారా..?, కబ్జాల కు తెగబడుతున్న అక్రమార్కులపై చర్యలు ఉంటాయా...?, తప్పుడు పత్రాలతో మున్సిపాలిటీ నుంచి తీసుకున్న ఇంటి నంబర్లను రద్దు చేస్తారా..?, కబ్జారాయుళ్లకు లోపాయికారిగా సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయా..? అనే ప్రశ్నలు బెల్లంపల్లి పురప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల కబ్జా నేపథ్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాలతో పంచాయతీ రాజ్, మున్సిపల్, రెవెన్యూ, పోలీ సు శాఖలకు చెందిన 20మందితో కొత్తగా భూ పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ భూముల కబ్జాలను నివారించి, అక్రమార్కుల వద్ద ఉన్న దస్త్రాలను పరిశీలించి చర్యలకు సిఫారసు చేస్తుందని ఆర్డీవో హరికృష్ణ ప్రకటించారు. ఏర్పడిన కమిటీ ఎంతమేరకు ని వారణ చర్యలు తీసుకుంటుంది, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతుందా లేక మొక్కుబడి చర్యలతోనే సరిపెడుతుందా అని చర్చించుకుంటున్నారు.

కబ్జాదారుల చేతుల్లో ప్రభుత్వ భూములు..

బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామ శివారు సర్వే నంబర్ 170లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపల్ ప్రాంతం ముప్పావు శాతానికి పైగా ఆ సర్వే నంబర్‌లోనే ఉంది. బొగ్గు గనుల విస్తరణ కోసం, అవసరాలకు అనుగుణంగా సింగరేణి వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను గరిష్టకాలానికి లీజుకు తీసుకుంది. ప్రస్తుతం గనులు మూతపడి, విభాగాలు ఎత్తివేతకు గురికావడంతో సింగరేణి యాజమాన్యం అవసరం లేని ఖాళీ భూములను, శిథిలావస్థకు చేరిన పురాతన కంపెనీ క్వార్టర్లను, వాటి పరిధిలోని భూములను తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. ఎప్పుడైతే సింగరేణి తన ఆధీనంలో ఉన్న లీజు భూములను ప్రభుత్వపరం చేసిందో అక్రమార్కులకు వరంగా మారింది. అప్పటి ఓ ముఖ్య ప్రజా ప్రతినిధి అండదండలతో విచ్చలవిడిగా భూముల ఆక్రమణకు తెగబడ్డారు. కార్మిక వాడలు, కార్మికేతర బస్తీలు, బజారు ఏరియా ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో భూ కబ్జాలు చేసి విలువైన భూములను సొంతం చేసుకున్నారు. ఆ భూముల్లో అక్కడక్కడ షాపులు నిర్మించుకుని వ్యాపారులకు అద్దెకు ఇవ్వగా, మరికొన్ని చోట్ల ప్లాట్లు చేసి అమ్మకాలు సాగించడం బహిరంగ రహస్యమైంది. మాజీ ప్రజాప్రతినిధి కనుసైగల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేసి భూ కబ్జాలను అడ్డుకోలేక చేతులెత్తేసిందనే విమర్శలు ఉన్నాయి.

ఆగని భూ ఆక్రమణలు...

అక్రమార్కులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఏళ్ల తరబడి నుంచి ఖాళీ భూములు కబ్జాలపరమవుతున్నాయి. ఎంచక్కా రాత్రికి రాత్రే పరాధీనమై పోతున్నాయి. తాజాగా అంబేద్కర్ రడగంబాల బస్తీ సర్వే నంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన సంగతి తెలిసిందే. అక్రమార్కులు తెలివిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ తండ్రి వెంకటస్వామి జ్ఞాపకార్థం ఇందిరమ్మకాలనీ అనే బోర్డు ఏర్పాటు చేసి భూదురాక్రమణకు సిద్ధపడటం ఆ వైనాన్నీ 'సాక్షి'వెలుగులోకి తేవడంతో ప్రభుత్వ భూమి కబ్జాకు అడ్డుకట్ట పడింది. అయితే కొత్తబస్టాండ్ ఏరియా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనకాల, కన్నాల, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల శివారు, షంషీర్ నగర్, రవీందర్‌నగర్, అంబేద్కర్‌నగర్, గంగారాం నగర్, హన్మాన్ విగ్రహం పరిసరాల్లో, ఆకెనపల్లి శివారు 2పైకి, 3పైకి సర్వే నంబర్లలో ఉన్న విలువైన భూములను ఆక్రమణ చేశారు. మిగిలి ఉన్న భూములను సైతం దురాక్రమణ చేయడానికి అక్రమార్కులు ఆరితేరి, రాజకీయ ముసుగులో ఉన్న కొందరు కాచుకుకూర్చుని ఉన్నారు. మరి భూ పరిరక్షణ కమిటీ భూకబ్జాలను ఎంత వరకు అరికడుతుంది, ఎలాంటి చర్యలకు సిద్ధపడుతుందో చూడాల్సిందే.

క్లుప్తంగా

పర్సనల్ అధికారులతో సమీక్ష

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్టుమెంట్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. కాన్ఫరెన్సు హాల్లో మంగళవారం ఉద్యోగుల జీతభత్యాలు, ప్రమోషన్లు వంటి వాటి పై డీజీఎం(పర్సనల్) అరవిందరావు సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం అందించాల్సిన బెనిఫిట్స్ ఎలా సకాలంలో అందించాలో వివరించారు. కార్యక్రమంలో డీవైపీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, సీనియర్ పీఓలు కాంతారావు, సునీల్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు

బెల్లంపల్లిరూరల్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో చీడ పీడలను నివారించి అధిక దిగుబడులు పొందవచ్చని సంగారెడ్డి పండ్ల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుచిత్ర అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల రైతువేదికలో మంగళవారం 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి సుప్రజ, ఏఈవోలు నాగదీప్తి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్ష చేస్తున్న నిపుణుడు అంజయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బజారు ఏరియాలోని శాంభవి విజన్ సెంటర్ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.48మందికి కంటి పరీక్షలు చేయగా 10మందికి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను స్థానిక లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రిలో, హన్మకొండ కంటి ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కంటి ఆపరేషన్‌కు వెళ్లిన వారికి ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సింగరేణి లయన్స్‌క్లబ్ కార్యదర్శి వంగల చక్రపాణి, సభ్యులు పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, కంటి పరీక్ష నిపుణుడు అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపరిశ్రమపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాకేశ్ శర్మ

భీమారం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల చెందిన విద్యార్థులకు పాడిపరిశ్రమ ప్రాముఖ్యతతో పాటు డైరీఫాం గురించి మండల పశువైద్యాధికారి రాకేష్ శర్మ వివరించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటికి చికిత్స చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నర్సింహులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ



కొత్తగుడిసెల కేంద్రంలో....

మంచిర్యాలటౌన్: పోషణ పక్షంను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లను ఆ వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి అందించారు. పోషణ పక్షం సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పౌష్టికాహారంపై పలు కార్యక్రమాల నిర్వహణలో భాగంగా చిన్నారులతో కలిసి పౌష్టికాహార భోజనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సమ్మక్క పాల్గొన్నారు. పోషణ పక్షం సందర్భంగా అశోక్‌రోడ్డు సెక్టార్ పరిధిలోని కొత్తగుడిసెల 1వ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి లబ్ధిదారులకు వివరించారు. అనంతరం పోషణ పక్షం ఆవశ్యకతలను వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె. తిరుమల, సహాయకురాలు కవిత పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు



కాంబోజీపేట వద్ద నిరుపయోగంగా బస్‌షెల్టర్

చెన్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాలలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల బస్ షెల్టర్లు ఉన్నా వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలో మొత్తం 30గ్రామ పంచాయతీలకు గాను 35గ్రామాలు ఉన్నాయి. ఇందులో కిష్టంపేట, కొమ్మెర, లింగంపల్లి గ్రామాల వద్ద మాత్రమే బస్‌షెల్టర్లను నిర్మించారు. మిగితాచోట్ల బస్‌షెల్టర్లు లేకపోవడంతో రోడ్డు పక్కనే నిలబడి వాహనాల కోసం ఎదురు చూడాల్సి వస్తుందని, ప్రస్తుతం ఎండ వేడిమికి ఇబ్బంది అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారే ప్రయాణ ప్రాంగణం



నిరుపయోగంగా బస్ షెల్టర్



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో ప్రయాణికుల కోసం గతంలో నిర్మించిన బస్‌షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలు, పండ్ల బండ్లు పెట్టడంతో నిరుపయోగంగా మారింది. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు రహదారే ప్రయాణ ప్రాంగణం అయ్యింది. మేదరిపేట 20గ్రామాలకు కూడలిగా ఉండటంతో, ఆ గ్రామాల ప్రజలు ఎటైనా ప్రయాణం చేయాలంటే మేదరిపేట బస్టాప్ వద్దనే బస్సులు ఎక్కడం, దిగడం చేస్తుంటారు. ఇలాంటి చోట ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు కనీసం నీడ వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వేచి చూసే వారంతా రోడ్డు పక్కనే నిలబడి ఉంటున్నారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను ఉపయోగంలోకి తేవడమో లేదా వేసవిలో కనీసం చలువ పందిళ్లు అయిన ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ షాపులకు వేలం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మున్సిపల్ దుకాణాలు, తైబజార్, మేకల మండీలకు కమిషనర్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం నిర్వహించారు. షాపు నంబర్- 4కు వేలం నిర్వహించగా నలుగురు పాల్గొన్నారు. రూ.5,400 అద్దెకు గాను హిందూ సేవక్ సమాజ్ ఫౌండేషన్ వారు దక్కించుకున్నారు. షాప్‌నంబర్-1కి నిర్వహించిన వేలంలో ఇద్దరు పాల్గొనగా కలవల సంతోష్ రూ.14,100కు పొందారు. షాపు నంబర్ -2కు నిర్వహించిన వేలంలో ఇద్దరు పాల్గొనగా తులా సాగర్ రూ.14,400కు దక్కించుకున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అద్దెకు గాను తైబజార్‌కు వేలం నిర్వహించగా, ఇద్దరు పాల్గొన్నారు. అనుముల నరేశ్ రూ.17.50 లక్షలకు దక్కించుకున్నారు. మేకల మండి నిర్వహణకు వేలం నిర్వహించగా ఎవరూ హాజరు కాలేదు. దీంతో దానిని రద్దు చేశారు. మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ మజార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు జిల్లా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాల పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి అంగన్‌వాడీ ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరించే ఆలోచన మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పించకుండా ఆన్‌లైన్ యాప్‌ల పేరుతో పనిభారంతో వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వేసవికాలం సెలవులు మంజూరు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకురాల్లు ప్రవీణ, విక్టోరియా, లావణ్య, రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

కోటపల్లి: ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని పార్‌పల్లి ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించి అధికారులు సూచనలు చేశారు. పనిప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందునా, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కొల్లూర్ నర్సరీని పరిశీలించారు. వేసవిలో ఎండ వేడిమిని తట్టుకునేలా మొక్కలను సంరక్షించాలని, షెడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమన్న, ఎంపీవో అక్తర్, ఈసీ నాగేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదర్శ్

బెల్లంపల్లి: జిల్లాలో ఉన్న గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రూప్-1, 2, 3, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందని, విద్యార్థి, యువజనులు పరీక్షలకు ప్రిపేర్ కావడానికి అప్‌డేట్‌తో వచ్చిన కొత్త పుస్తకాలను వెంటనే తెప్పించాలన్నారు. ప్రతి గ్రంథాలయంలో పర్మినెంట్ లైబ్రేరియన్‌ను నియమించాలని, గ్రంథాలయాల్లో వైఫై సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. పరీక్షలు జరిగేంత వరకు గ్రంథాలయాలకు సెలవులు ప్రకటించకుండా చూడాలని తెలిపారు. పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయాల్లో మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేయాలని, గ్రంథాలయాల సమయపాలన ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు శివ ప్రసాద్, వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పనులు ప్రారంభం



భీమిని: ఎట్టకేలకు కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 2016సంవత్సరంలో భీమిని నుంచి కన్నెపల్లి మండలం విడిపోయి నూతన మండలంగా ఏర్పడింది. అప్పటి నుంచి ఓ ప్రభుత్వ భవనంలో కొనసాగుతుండగా, ప్రస్తుతం సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పోలీస్‌స్టేషన్ పనులు ఈ ఏడాదిలోపు పూర్తి చేయనున్నట్లు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు!





కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామంలో మురుగునీరు రోడ్డుపై పారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సర్పంచ్‌లు ఉన్నప్పుడే పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోగా, ప్రస్తుతం ప్రత్యేకాధికారులు ఒక్కరోజు కూడా గ్రామాల్లో పర్యటించకపోవడంతో గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడనే పేరుకుపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అధికారులు గ్రామంలో ఒక్కసారి కూడా పర్యటించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించి గ్రామస్తులు రోగాలపాలవుతున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం

మంచిర్యాలటౌన్: పంజాబ్‌లో జరుగుతున్న మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన కొలిపాక వెంకటేశ్వర్లు ప్రయాణ ఖర్చుల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్ సంజీవ్, కాంగ్రెస్ నాయకులు ఆరె దేవేందర్, శ్రీనివాస్, ఆరీఫ్, రఫీక్, సందీప్, ప్రవీణ్, అశోక్, అర్జున్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు తెలంగాణ అటవీశాఖ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ అధికారులు మంగళవారం నాలుగు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్, లక్ష్మణ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం గణేష్, శశిధర్ సిబ్బంది ఉన్నారు.

విజయవంతంగా టాలెంట్ టెస్ట్



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరై ప్రతిభను చాటారు. ఈ పరీక్షలో కర్ణమామిడి కస్తూరిబా బాలికల విద్యాలయం విద్యార్థిని లక్ష్మీప్రసన్న మొదటి బహుమతి, రాంపూర్ ఆవాస విద్యాలయం విద్యార్థిని అశ్విని ద్వితీయ బహుమతి, మౌంట్ కార్మల్ పాఠశాల విద్యార్థిని హర్షిత తృతీయ బహుమతి సాధించగా, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అర్చన టాపర్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, కేజీబీవీ జిల్లా అధికారి యశోధర, జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఏఎస్ఓ రాజ్‌కుమార్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ హంగామా!



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థుల నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

గేటు తెరుచుకోదు.. గేమ్స్ లేవు

- పూర్తికాని చెన్నూర్ మినీ సేడియం
- పనులు కాకముందే ప్రారంభించిన వైనం



తెరుచుకోని మినీ స్టేడియం గేటు

చెన్నూర్: క్రీడాకారులకు ఆటల్లో తర్ఫీదునిచ్చి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం 2015లో చెన్నూర్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. 2016లో పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ మధ్యలోనే వెళ్లిపోవడంతో పనులు సాగలేదు. 2019లో పనులను తిరిగి ప్రారంభించారు. మినీ స్టేడియం నిర్మాణానికి తొలుత రూ.2.65 కోట్లు మంజూరయ్యాయి. అవి చాలకపోవడంతో కాంపౌండ్‌వాల్, ఇండోర్ షటిల్ కోర్టు నిర్మాణానికి మరో రూ.1.70 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

పనులు కాకుండానే ప్రారంభం..

స్టేడియం పనులు పూర్తి కాకుండానే గత పాలకులు హడావుడిగా ప్రారంభించి చేతులు దులుపేసుకున్నారు. స్టేడియం ప్రారంభించి ఐదు నెలలు కావస్తున్నా, నేటికీ అధికారులు, కాంట్రాక్టర్ నుంచి స్టేడియాన్ని స్వాధీనం చేసుకోలేదు. ఇక స్టేడియం గేటు తెరుచుకున్నది లేదు. దీంతో స్టేడియం అందుబాటులోకి వస్తుందనుకున్న క్రీడాకారులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

నిధులు నిలిచిపోయి..

ఇండోర్ స్టేడియం నిర్మాణంతోపాటు క్రీడా సామగ్రి, కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు ప్రతిపాదించిన నిధులు రాలేదు. నిధులు నిలిచిపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

- రాజశేఖర్, ఏఈ

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయుల ఉదారత

జన్నారం: మండలంలోని మురిమడుగు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దుర్గం శివసాయి తండ్రి ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. దీంతో శివసాయి బడి మానేసి, మేకల కాపరిగా పనిచేయాల్సి వచ్చింది. కాగా విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు రూ. 21వేలు పోగు చేసి విద్యార్థి తండ్రికి మంగళవారం అందజేశారు. విద్యార్థి పదో తరగతి పూర్తయ్యే వరకు అయ్యే ఖర్చులు తామే భరిస్తామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండల గ్రామీణ వైద్యుల అసోసియేషన్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాశ్‌రావును నియమించారు.

శ్రీశైలంకు జ్యోతిష్య శిరోమణి అవార్డు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీ (షిర్కే)కు చెందిన పురోహితుడు చీకటి శ్రీశైలం జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు.

ప్రెస్‌క్లబ్ రీడింగ్ గదికి భూమిపూజ

జన్నారం: ప్రెస్‌క్లబ్ భవనం రీడింగ్ గది నిర్మాణ పనులకు మంగళవారం ఎంపీడీవో శశికళ భూమిపూజ చేశారు.

ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే 6 గని క్యాంటీన్‌లో పనిచేస్తున్న మనెమ్మ అనే కాంట్రాక్టు ఉద్యోగి కూతురు వివాహానికి గని కార్మికులు,సూపర్‌వైజర్లు,అధికారులు రూ.52,000 పోగు చేసి ఆర్థిక సాయం అందించారు.

చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: యాదాద్రి టెంపుల్ ఈవోపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నేలపై కూర్చోబెట్టడాన్ని తప్పుబట్టారు. తక్షణమే సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'మహిళా శక్తి'కి తరలిన మహిళలు

నెన్నెల/మంచిర్యాలటౌన్: గ్రామీణ, పట్టణ మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికై రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న మహిళా శక్తి విధాన ఆవిష్కరణ కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపాలిటీ నుంచి మెప్మా సభ్యులు, నెన్నెల నుంచి మండల ఐకేపీ సంఘ సభ్యులు తరలివెళ్లారు.

విజయసంకల్ప సభకు కమలనాథులు

బెల్లంపల్లి: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం జరిగిన బీజేపీ విజయసంకల్ప సభకు బెల్లంపల్లి నుంచి కమలనాథులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.